## క్లుప్తంగా

### మార్కెట్ యార్డుకు కందులు తరలించాలి



కందులను పరిశీలిస్తున్న చుక్కారెడ్డి

**చొప్పదండి:** ఈనామ్ ద్వారా కందులకు అధిక ధర లభిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి కోరారు. వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్‌తో కలిసి మంగళవారం ఈనాం ద్వారా మొక్కజొన్న, కందుల కొనుగోళ్లను పరిశీలించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొక్కజొన్న, కందులకు ఈనాంలో అధిక ధర వస్తుందని, చొప్పదండిలోని రైతులకు మంగళవారం అత్యధికంగా క్వింటాల్ కందులకు రూ. 7,380ల ధర పలికిందన్నారు. రైతులు మార్కెట్ యార్డుకు కందులు తరలించి అధిక ధరలు పొందాలని కోరారు. వెంట ఏనుగు స్వామిరెడ్డి, కాశీనాథం, సాంబమూర్తి, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విసుగు

**శంకరపట్నం:** రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగెత్తారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో మంగళవారం బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం, అర్హులకు సంక్షేమపథకాలు అందడంలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే గ్రామాలకు నిధులు వస్తున్నాయని, రాష్ట్ర ప్రజలు మార్పుకోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు సమ్మిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కొంరయ్య, రాజిరెడ్డి, జైపాల్, మండల నాయకులు సంపత్, నరేందర్, సారయ్య, భాస్కర్, శ్రీకాంత్, మహేందర్, కుమార్, మహిళలు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### ఫొటో దిగి ఇస్తానని వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసుతో పరారీ

**జమ్మికుంట:** మాయమాటలతో వృద్ధురాలిని నమ్మించి ఆమె మెడలోని బంగారు గొలుసు పరారైన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందుకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఉమ్మనవేన రాజమ్మ అనే వృద్ధురాలు జమ్మికుంట మండలంమాచనపల్లి గ్రామంలోని కూతురు ఇంటికి బోనాల పండుగకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో పట్టణంలోని మాచనపల్లి ఆటోల అడ్డా వద్దా వృద్ధురాలితో గుర్తు తెలియని ఓ వ్యక్తి మాట మీ మనవడు నాకు బాగా తెలుసని, మాటలు కలిపాడు. ఆమె ముందు ఫోన్‌లో మాట్లాడినట్లు చేశాడు. ఈక్రమంలో నా భార్యతో నేను ఫొటో దిగాలని, నీ మెడలోని బంగారు గొలుసు ఒక్కసారి ఇస్తే ఫొటో దిగివచ్చి ఇస్తానని నమ్మబలికి కొద్ది దూరం తీసుకెళ్లాడు. అనంతరం బంగారు గొలుసు తీసుకొని పరారయ్యాడు. దీంతో రాజమ్మ లబోదిబోమంది. వెంటనే తన మనవడు అశోక్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీ సిన ప్రయోజనం లేక పోవడంతో పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. కనవేన అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చే స్తున్నామని జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాలు.. పోతిరెడ్డిపేటకు చెందిన కటిక యశ్వంత్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా హుజూరాబాద్ వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. యువకుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**గీతకార్మికుడికి...**

**శంకరపట్నం:** మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు మార్క మల్లయ్య మంగళవారం తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తుల వివరాలు.. తాటివనంలో చెట్టు ఎక్కి పైనుంచి పడ్డాడు. తీవ్రంగా గా యపడడంతో హుజూరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

# స్పెషల్ డ్రైవ్

**హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో వసూలు చేయాల్సిన వివిధ రకాల పన్నులు రూ.3.46 కోట్లు**

- ఇప్పటివరకు వసూలైంది 51 శాతం
- లక్ష్యం చేరే దిశగా అధికారులు, సిబ్బంది చర్యలు



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

**హుజూరాబాద్:** బల్దియాకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను. ఈ ఆర్థిక సంవత్సరం వచ్చే నెలతో ముగియనుంది. ఇప్పటి వరకు బల్దీయా అధికారులు 51 శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూల్ పూర్తి చేశారు. లక్ష్యం చేరే దిశగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లపైనే అధికారులు, సిబ్బంది దృష్టి సారిస్తుండగా పేరుకుపోయిన పాత బకాయిలు కూడా ఎక్కువే ఉన్నాయి.

### వేగం పెంచిన అధికారులు

హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను వసూలుకు అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున ప్రత్యేక సిబ్బందిని నియమించారు. నెల రోజులుగా ఆస్తిపన్ను వసూళ్లలో అధికారులు వేగం పెంచారు. మున్సిపల్ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో వసూల్ చేయాల్సిన వివిధ



హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం

రకాల పన్నులు రూ.3.46 కోట్లు, ఇప్పటి వరకు రూ.1.79 కోట్లు వసూలు చేశారు.

### మొండి బకాయిదారులకు నోటీసులు

ఐదువేలకు పైన ఆస్తి పన్ను బకాయి ఉండి, సకాలంలో చెల్లించని వారికి అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసి పన్నుల వసూళ్లకు చర్యలు చేపట్టారు. నోటీసులకు స్పందించి సకాలంలో పన్నులు చెల్లించకుంటే వారెంట్ అందించి ఉన్న ఆస్తిని జప్తు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా 100 శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలనే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### పేరుకుపోయిన నల్లా పన్నులు

కొన్నేళ్లుగా నల్లా పన్నులు పేరుకుపోయాయి. ఇప్పటివరకు నల్లా పన్నుల బకాయి రూ. 1.11 కోట్లు కాగా రూ.10.50 లక్షలు మాత్రమే వసూలైంది. అదే విధంగా మున్సిపల్ కార్యాలయానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు రూ.46 లక్షలు, ఇందులో రూ.4 లక్షలు మాత్రమే వసూలైంది. మున్సిపల్ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూల్‌కు మార్చి 31వ తేదీ వరకు గడువు ఉండటంతో వందశాతం వసూలు చేయాలని అధికారులు చర్యలు చేపట్టారు.

### అభివృద్ధికి సహకరించాలి



పన్నుల వసూళ్లకు అవసరమైన చర్యలు చేపట్టి ముందుకు వెళ్తున్నాం. ప్రత్యేకంగా ఐదు బృందాల ద్వారా ఇప్పటివరకు 51 శాతం వసూలు చేశాం. మిగితా బకాయి కూడా వసూలు చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం. మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

### పత్తి క్వింటాల్ ధర రూ.7,950

**జమ్మికుంట:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,950 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 104 వాహనాల్లో 1,459 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,950, మోడల్ ధర రూ.7,800, కనిష్ట ధర రూ.7,300 చెల్లించారు. గన్నీ సంచుల్లో 19 మంది రైతులు 30 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.6,200 పలికింది. క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

### విద్యార్థులకు నగదు అందజేత



నగదు అందజేస్తున్న జువ్వాడి సాగర్‌రావు

**మానకొండూర్:** తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు పెద్ద కుమారుడు జువ్వాడి అమిత్ సాయి కుమార్తె అనన్య పుట్టినరోజు సందర్భంగా పేద విద్యార్థులకు నగదు అందజేశారు. మండలంలోని రామకృష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.పదివేల ఆర్థికసాయం అందజేసి, దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సాగర్‌రావుకు హెచ్‌ఎం మహేశ్వర్ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ పాఠశాలకు సహాయసహకారాలు అందించాలని కోరారు. సర్పంచ్ మీసాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్‌ఫేర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మానకొండూర్: బహుమతులందిస్తున్న ఎంఈవో





గంగాధర: రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



చిగురుమామిడి: సన్మానిస్తున్న రఘునాథరెడ్డి

**చిగురుమామిడి:** మండలంలోని ఇందుర్తికి చెందిన చింతపూల సుష్మిత (ఆరోతరగతి విద్యార్థిని) రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేర్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన విషయం విధితమే. మంగళవారం సుష్మితను గ్రామంలోని పాఠశాలలో లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి మెమోంటో బహూకరించి శాలువాతో సన్మానించారు. ఇటీవల జిల్లా స్థాయిలో సైన్స్‌ఫేర్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. త్వరలో నిర్వహించే జాతీయస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

**మానకొండూర్:** జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయులు మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నలుగురుప్రతిభ కనబరచగా మండల విద్యాధికారి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కె. రంజిత్(వెల్ది జడ్పీహెచ్‌ఎస్), ద్వితీయ, తృతీయ బహుమతులు కె. పూజిత, కె. సృజన(జడ్పీహెచ్‌ఎస్ పచ్చునూర్), అదే విదంగా కొండపల్కల ఉన్నత పాఠశాలకు చెందిన జి. నాగశ్రీ కన్సోలేషన్ బహుమతి, బాలికల మానకొండూర్ ఎస్. ఫాతిమాకు మండల విద్యాధికారి బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి పరీక్ష ఫిబ్రవరి 21న ఉంటుందని పచ్చునూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి. ఓదెలు తెలిపారు. ఉపాధ్యాయుల శ్రీనివాస్, రాజేశ్, కుమార్, సరోజన, సత్య ప్రకాశ్, ఆనందం విద్యార్థులు పాల్గొన్నారు.

**హుజూరాబాద్:** పదోతరగతి విద్యార్థులకు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పొడిశెట్టి అభిలాశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభా పరీక్ష పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పరీక్షలపై భయం పోతుందని, పరీక్షలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

**గంగాధర:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో రాణించిన విద్యార్థులను హెచ్‌ఎం, ఎంఈవో వేణుకుమార్, ఉపాధ్యాయులు ప్రశంసించారు. మండల స్థాయి పోటీల్లో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విష్ణువర్ధన్ (గర్శకుర్తి), అనుష్క (గంగాధర), నవీన్ కుమార్ (గర్శకుర్తి), అక్షిత (మోడల్‌స్కూల్ గంగాధర) మొదటి నాలుగు స్థానాల్లో రాణించారు.

# ఇల్లు కట్టుకోవడానికి ఆర్థికసాయం

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**మానకొండూర్:** అర్హులైనవారు డబుల్ బెడ్రూం ఇల్లు కట్టుకోవడానికి డబ్బులిస్తాం, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రంగపేట, కెల్లెడ, మద్దికుంట, పచ్చునూర్, పోచంపల్లి, లలితాపూర్, మానకొండూర్ గ్రామాల్లో మంగళవారం పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావుతో కలిసి షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. సాగునీరు లేక చెరువు ఎండిపోతుందని డీబీఎం 6 ఉప కాలువకు యూటీ కావాలని ఎమ్మెల్యేను కెల్లెడ గ్రామస్తులు కోరారు. వృద్ధులు కళ్లు కనిపించడం లేదని, కంటి ఆపరేషన్ చేసుకోవాలని కోరగా కంటి వెలుగు పథకం ఉందని అందులో పరీక్షలు చేయిస్తామని చెప్పారు. చాలా మంది ఇళ్లులేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయితీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. రంగపేటలో ఇళ్ల పట్టాలు అందజేస్తామని, అన్ని గ్రామాలలో అభివృద్ధి చేశామని, ఇళ్లకు వచ్చి చెక్కులు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. మండల కేంద్రంలోని వేద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు రొడ్డ పృథ్వీరాజు గోపు పావని, మాతంగి పుల్లయ్య, కొత్తూరి పద్మ, రామంచ గోపాల్‌రెడ్డి ఉపసర్పంచ్‌లు నెల్లి మురళి, నాయకులు అడప రాజేశం , సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# పంటమార్పిడిపై అవగాహన



మాట్లాడుతున్న ఏవో రంజిత్‌కుమార్

**చిగురుమామిడి:** రైతులు పంట మార్పిడి విధానం అవలంబిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రంజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇందుర్తి రైతు వేదికలో మంగళవారం రైతులకు పంటమార్పిడి విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో వస్తున్న రోగాలు పంట మార్పిడితో నయమయ్యే అవకాశం ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ సాగుచేస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. అవగాహన సమావేశంలో రైతుబంధు మండల సమితి కోఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, సర్పంచ్ బోయిని శ్రీనివాస్, గ్రామ కోఆర్డినేటర్ చింతపూల అంజయ్య, ఏఈఓ సతీష్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారుడికి సన్మానం



సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

**రామడుగు:** జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణ నుంచి బంగారు పతకం సాధించిన చిప్పకుర్తి గ్రామానికి చెందిన పులి అంజనేయులుగౌడ్‌ను మండలంలోని గోపాల్‌రావుపేట గౌడసంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. నాయకులు వెంకటయ్యగౌడ్, సుద్దాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### కౌశిక్‌రెడ్డిని కలిసిన నాయకులు



**జమ్మికుంట:** శాసనమండలి విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యామ్, ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్యాక్స్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**జమ్మికుంట:** మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనా జవేరియా ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో క్యాన్సర్, డీ వార్మింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లతో క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గించుకోవచ్చని, జీవన శైలిలో మార్పులు, రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేసుకుంటే, క్యాన్సర్ త్వరగా గుర్తించి, చికిత్స అందించవచ్చాన్నారు. ముందుస్తు గుర్తింపుతో 40శాతం మరణాలను నివారించవచ్చని అన్నారు. సమతుల్య ఆహార అలవాట్లు చికిత్సకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, రామకృష్ణ, ల్యాబ్ టెక్నిషయన్, ఆరోగ్యశాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన**

**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం లేవడం, సైకిల్ తొక్కడం, పోషకాహారం తీసుకోవడం, వీలైనంత వరకు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య, రవీందర్, టీచర్లు, హుజూరాబాద్ డిప్యూటీ డీంహెచ్‌వో చందు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజిద్‌హుస్సేన్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, జలందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవీరులకు నివాళి



హుజూరాబాద్‌రూరల్: నివాళి అర్పిస్తున్న స్టూడెంట్స్





రామడుగు: గోపాల్‌రావుపేటలో...

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఏకశిలా సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు పుల్వామా అమరవీరులకు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, టీచర్లు పాల్గొన్నారు.

**గోపాల్‌రావుపేటలో..**

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని అక్షర విద్యాలయం విద్యార్థులు, టీచర్లు మంగళవారం పుల్వామా అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కో ఆర్డినేటర్లు రైతుల సంక్షేమం కోసం పనిచేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

**చిగురుమామిడి:** రైతుల సంక్షేమం కోసం గ్రామ, మండల స్థాయి రైతుబంధు కోఆర్డినేటర్లు పనిచేయాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జెడ్పీటీసీ గీకురు రవీందర్‌తో కలిసి రైతుబంధు సమన్వయ సమితి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. రైతులు వేసే వరి పంటలు రోగాలతో పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఓ రంజిత్‌కుమార్, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ తిరుపతి, జిల్లా రైతు బంధు కమిటీ సభ్యుడు కొంరయ్య, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### మత్స్యగిరీంద్రస్వామి జాతర ఆదాయం రూ.14,79,020

**శంకరపట్నం:** మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతర ఆదాయం రూ.14,79,020 వచ్చినట్లు ఈవో సుధాకర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు కానుకలు సమర్పించగా మంగళవారం ఆలయంలో లెక్కింపు నిర్వహించారు. హుండీలు ద్వారా రూ.4,76,550, టికెట్ల ద్వారా రూ.2,95,954, వేలం ఆదాయం రూ.3,56,516, లడ్డు, ప్రసాదం రూ.3,50,000 వచ్చాయని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మ న్ మల్లారావు, సర్పంచ్ కిషన్‌రావు, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



చొప్పదండి: విరాళం అందిస్తున్న శ్రీనివాస్



రామడుగు: విరాళం అందిస్తున్న దాత

**చొప్పదండి:** మండలంలోని మంగళపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రామోజు లక్ష్మణచారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాస్, స్వర్ణ దంపతులు మంగళవారం లక్ష రూపాయలు విరాళంగా అందించారు. దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రామడుగులో..**

**రామడుగు:** మండల కేంద్రంలో నిర్మిస్తున్న మార్కెండేయ దేవాలయం అభివృద్ధికి ఎంపీటీసీ బొమ్మరవేని తిరుమల తిరుపతి మంగళవారం రూ. 20 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మామిడి లత, అంజయ్య, సుభద్రభద్రయ్య, వేముల రాజేశం, మనిందర్, రాజేశం, అనుపురం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.